www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 11 మార్చి 2024

5


అన్నమయ్య



నేడు యథావిధిగా 'జగనన్నకు చెబుదాం'

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు అందజేయాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యల పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఏ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

'ఉక్కు' పనుల్లో కదలికేది?



2017లో ప్రతిపక్ష నాయకుని హోదాలో చేపట్టిన పాదయాత్ర సందర్భంగా మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ శంకుస్థాపనకు పరిమితమైంది. దీంతోపాటు చెన్నూరులో సుగర్ పరిశ్రమ పునరుద్ధరణ, కడపలో స్టార్మ్‌వాటర్ డ్రైయిన్లు, రాజోలు, జొలదరాశి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ఇచ్చిన హామీలు అమలుకు ఆమడదూరంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యమంత్రి హోదాలో అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ, జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనుల పునరుద్ధరణ, కొప్పర్తి పైప్‌లైన్, హజ్‌హౌస్ పెండింగ్ పనులు, ఒంటిమిట్ట చెరువులో జలాంజనేయుని విగ్రహం ఏర్పాటు వంటి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండడం విస్మయాన్ని కలిగిస్తోంది. రాబోయే రెండు నెలల్లో ముఖ్యమంత్రి టర్మ్ ముగియనున్న నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటన నేపథ్యంలో కథనం...

- ◆ అటకెక్కిన చెన్నూరు చక్కెర పరిశ్రమ
- ◆ కదలని జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2
- ◆ అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణేదీ
- ◆ గండికోట అదనపు పరిహారం చెల్లింపులేవీ
- ◆ నేడు పులివెందులకు సిఎం వైఎస్ జగన్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రగతి నత్తనడకన సాగుతోంది. కొప్పర్తి పారిశ్రామికవాడలో పరిశ్రమలు, గోపవరంలో సెంచురీప్లైవుడ్ పరిశ్రమలు, జిజిహెచ్ సూపర్ స్పెషాలిటీ మినహా మిగిలిన హామీలు అమలుకు నోచుకోలేదు. ముఖ్యంగా చెన్నూరు సుగర్ పరిశ్రమ పునరుద్ధరణ, జెఎస్‌డబ్ల్యూ కంపెనీ ఉక్కు పరిశ్రమ, జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనుల్లో ఆశించిన రీతిలో కదలిక కని పించడం లేదు. చెన్నూరు సుగర్స్ కంపెనీ పునరుద్ధరణ సర్వే దశలోనే మునకలేస్తోంది. పునరుద్ధరణ పనులకు రూ.60 కోట్లను విడుదల చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. 2007లో కీ.శే, మాజీ ముఖ్యమంత్రి అప్పటి వైఎస్ సర్కారు తలపెట్టిన రూ.72 కోట్లతో కడపలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ కోల్డ్‌స్టోరేజీకి పరిమితమైంది. ఫలితంగా వర్షా కాలంలో కడప నగరంలోని లోతట్టు ప్రాంతాలు నీటిలో మునకలు వేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

అడ్డంకుల్లోనే ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ

రూ.345 కోట్లతో కూడిన ఆర్కిటెక్షర్ యూనివర్శిటీ పనులకు మోక్షం లభించలేదు. ఐదేళ్లుగా స్థలం ఎంపిక, శంకుస్థాపన దశలోనే మగుతోంది. ఫలితంగా యూనివర్శిటీ భవన నిర్మాణం ఎప్పటికి సాకా రమవుతుందో తెలియని దుస్థితి దాపురించింది. దీనికితోడు రూ.12 కోట్ల తో కూడిన హజ్‌హౌస్ పెండింగ్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు. నిధుల లేమి కారణంగా సకాలంలో పూర్తి చేయడంపై సందేహం నెలకొంది.

కొప్పర్తి పైప్‌లైన్‌కు మోక్షమెప్పుడో?

రూ.150 కోట్ల విలువ కలిగిన కొప్పర్తి పారిశ్రామికవాడ నీటి సంఫరా పైప్‌లైన్ సాకారానికి నోచుకోవడం లేదు. నీటి కొరత, పర్యావరణ అనుమతుల కారణంగా పారిశ్రామిక పురోగతి కొరవడింది. ఇటీవల కొప్పర్తిలోని వైఎస్ఆర్ క్లస్టర్లలో ఏర్పాటు చేసిన పరిశ్రమలకు నీటి సదు పాయం అందడం లేదు. ఫలితంగా ఎప్పటికి పూర్తి స్థాయిలో కార్యకలాపాలు సాగిస్తాయో తెలియడం లేదు. కడప, ప్రొద్దుటూరు పాల పరిశ్రమల కార్యకలాపాలు ఆశించిన రీతిలో సాగడం లేదు. ప్రొద్దుటూరులో మూలన పడిన పాలపరిశ్రమ ఆస్తుల తనఖా పెట్టిన నేపథ్యంలో సుమారు రూ.90 కోట్లు చెల్లింపులకు నోచుకోకపోవడం లేదు. జగనన్న పాలవెల్లువ వంటి పథకంలో భాగంగా పునరుద్ధరణ కార్యకలాపాలను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రూ.12 కోట్లతో కూడిన బుగ్గవంక బ్యూటిఫికేషన్, లైటింగ్ సిస్టమ్ ఎప్పుడు ఏర్పడతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది.

కదలని జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2

జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులకు కదలిక ఎప్పుడు వస్తుందో తెలియ డం లేదు. ఫేజ్-1లో భాగమైన సర్వరాయసాగర్, వామి కొండ రిజర్వాయర్లు ఎప్పటికి సాకారమవుతాయో తెలియడం లేదు. ఇటీవల జిల్లా నీటి పారుదలశాఖ రూ.212 కోట్లతో కూడిన ప్రతిపాదనల అనుమతుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. రూ.82 కోట్లతో కూడిన మైలవరం రిజర్వాయర్ ఆధునీకరణ ప్రతిపాదనలకు మోక్షం లభించడం లేదు.

నిరాశలోనే..నిర్వాసితులు

అన్నమయ్య, గండికోట నిర్వాసితుల కన్నీటి ధార ఆగడం లేదు. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ రూ.777 కోట్లతో టెండర్లకు పరిమితమైంది. రెండేళ్ల కిందట అన్నమయ్య రిజర్వాయర్ గల్లంతైన ఘట నలో ఆరు గ్రామాలు తీవ్రంగా నష్టపోయిన సంగతి తెలిసిందే. ఐదు సెంట్లలో ఇళ్లు నిర్మించి ఇస్తామన్న హామీ అమలులో నిర్లక్ష్యం నెలకొంది. దీంతోపాటు గండికోట నిర్వాసితులకు అదనపు పరిహారం కింద రూ.3.25 లక్షలు ఇస్తామన్న హామీ కాగితాలకే పరిమితమైంది.



మహిళా దినోత్సవ వేడుకల్లో మహిళా నాయకులు

మహిళ లేనిదే మనుగడ లేదు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మహిళ లేనిదే మానవ జాతి మనుగడే లేదని సిఐటియు, యుటిఎఫ్, ఐద్వా నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బాలికల హైస్కూల్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మహిళల హక్కులు, చట్టాల గురించి వివరించారు. స్త్రీ అనుకుంటే సాధించలేనిది ఏమి లేదన్నారు .మహిళ లు ఎన్నో పోరాటాలు చేసి తమ హక్కులు చాలా సాధించుకున్నారని చెప్పారు. మహిళలు చేసే పోరాటానికి సిఐటియు ఎప్పుడూ మద్దతు, అండగా ఉంటుందని చెప్పారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ మాట్లాడుతూ మహిళ వంటింటికి పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ముందు ఉంటారని చెప్పారు. భవిష్యత్తులో మహిళలు మరిన్ని హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్త స్వప్న మహిళలు పడే కష్టాలు, సాధించుకున్న హక్కులపై ఆలపించిన పాట పలువురిని ఆకట్టుకుంది. కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మహిళా నాయకులు గంగాదేవి, మిని వర్కర్ వనజ, అంగన్వాడీ రాయచోటి మండల కార్యదర్శి అరుణ, విజయ, సురేఖ, శంకరమ్మ, భారతి, ముంతాజ్, సుహాసిని, శోభ, రమీజ పాల్గొన్నారు.

'అన్నమయ్య' వరద బాధితుల్ని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకొని పోయి రెండేళ్లు పూర్తయినప్పటికీ ఇంత వరకు పునరుద్దరణ పనుల్లో పురోగతి లేదని, వరదల కారణంగా నష్టపోయిన బాధితుల్ని ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య విమర్శించారు. ఆదివారం అన్నమయ్య ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకేపాడు ఎగువ ప్రాంతంలో 1981 సంవత్సరంలో రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాలకు సాగు, తాగునీరు అందించేందుకు 2.2 టిఎంసిల సామర్థ్యంతో 5 గేట్లు ఏర్పాటు చేశారన్నారు. 2003 సంవత్సరంలో అధిక వర్షాల ద్వారా 1 గేటు కొట్టుకొని పోయివందని, తరువాత 2021 నవంబర్ 19 అన్నమయ్య ప్రాజెక్టు కట్ట తెగి కొట్టుకొని పోయి సుమారు 12 గ్రామాల్లో వరద తాకిడికి ప్రజలు అల్లాడిపోయారని చెప్పారు. ఇంత వరకు అన్నమయ్య ప్రాజెక్టు స్థితి గతి లేకుండా పోయిందని చెప్పారు. తద్వారా సుమారు 100 గ్రామాలకు భూమిలో నీటి శాతం తగ్గిపోయి రైతాంగం సాగుకు బోర్లు ఎండిపోతున్నాయని, మరోవైపు తాగడానికి కూడా కష్టాలు ఏర్పడుతున్నాయని వాపోయారు. వరదల్లో సర్వం కోల్పోయిన గ్రామాలు నేటికీ పూర్తిస్థాయిలో కోలుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం త్వరగా ప్రాజెక్టు పనులు ప్రారంభం చేసి పటిష్టంగా ప్రాజెక్టు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని పోరాటాలకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

బలిజ సేన జిల్లా అధ్యక్షులుగా కె.ఎస్. నరసింహ

రాజంపేట అర్బన్ : పట్టణంలోని భువనగిరిపల్లెకు చెందిన కె.ఎస్ నరసింహను బలిజ సేన అన్నమయ్య జిల్లా అధ్యక్షులుగా నియమిస్తూ బలిజ సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా నియమించిన ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మస్తాన్ రాయల్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. బలిజ సామాజిక అభ్యున్నతి కోసం అన్ని విధాల కృషి చేస్తానని, బలిజల సంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా పోరాడుతానని తెలియజేశారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే కూటమి : 'చమర్తి'

ప్రజాశక్తి - రాయచోటి



సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్‌రాజు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కోసమే చంద్రబాబు బిజెపితో పొత్తుకెళ్లారని, వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడుతుందని తద్వారా రాష్ట్ర ప్రయోజనాలు సాధించుకోవడానికి వీలవుతుందని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు తెలియజేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేవంలో ఆయన మాట్లాడారు. 2014లో బిజెపితో పొత్తు ఉన్నప్పటికీ, చంద్రబాబు సారథ్యంలో అన్ని వర్గాల వారికి సంక్షేమ అభివృద్ధి పథకాలు అందాయని చెప్పారు. వైసిపికి ఓట్లు వేసిన అన్ని వర్గాలను నిర్లక్ష్యం చేసి వారిపైనే దాడులు చేసి రాష్ట్రంలో విధ్వంశ పరిపాలన సాగిస్తున్నారు అన్నారు. చంద్ర బాబు నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకి న్యాయం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ సంకల్పించిన మహాయజ్ఞానికి జనసేనతో పాటు బిజెపి కూడా కలిసివచ్చింది అన్నారు. అరాచక వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదించేందుకే మూడు పార్టీలు కలిసికట్టుగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనున్నాయని తెలిపారు. తెలుగుదేశం పార్టీపై కేంద్రంలో ఉన్న బిజెపి పెద్దలకు కూడా నమ్మకం కలిగిందని, అందుకే కేంద్రం పొత్తులకు ఆహ్వానించింది అన్నారు. తెలుగు ప్రజల కోసం, ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీ సంకల్పించిన మహాయజ్ఞానికి ఇటు జనసేనతో పాటు, బిజెపి కూడా కలిసి వస్తోంది అన్నారు. నారా చంద్రబాబు నాయుడు దార్శనిక పాలన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రక్షగా ఉంటుందని ,అతిపెద్ద జాతీయపార్టీతో పాటు దేశం మొత్తం తమకు మద్దతిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ముస్తాక్ హుస్సేన్, గోరాన్ చెరువు మాజీ సర్పంచ్ శ్రీనివాసరాజు, సుధాకర్ పాల్గొన్నారు.

'లంకమల దారుల్లో' పుస్తకావిష్కరణ

కడప అర్బన్ : లంకమల వివేక్ రచించిన 'లంకమల దారుల్లో' పుస్తకం ప్రకృతి సౌందర్యానికి ప్రతిరూపమని సి.పి.బ్రౌన్ భాష పరిశోధన కేంద్రం బాధ్యులు రామప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం వైవీయూ ఆధ్వర్యంలో బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ పుస్తకం కేవలం యాత్రా సందర్శన పుస్తకవేకాక విజ్ఞానదాయక, కథాంశాలతో కూడుకున్న విశ్లేషణాత్మక రచన అన్నారు. సభాధ్యక్షులు శివ మాట్లాడుతూ అడవి అనేది ఒక సందర్భంలో భయంకరంగానూ, ఆహ్లాదం గానూ కనబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ రచయితలు పాల్గొన్నారు.

శిల్పారామంలో వైఎస్ఆర్ విగ్రహం ఏర్పాటు

కడప అర్బన్ : నగరంలోని శిల్పారామంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని రాష్ట్ర శిల్పారామం పరిపాలనాధికారి శ్యాం సుందర్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడిలో ఉండే తల్లిదండ్రులు, పిల్లలు ఆదివారం రోజు శిల్పారామానికి వచ్చి సేదతీరవచ్చని పేర్కొన్నారు. కుటుంబ సమేతంగా సరదగా గడవచ్చని చెప్పారు. 17 ఎకరాల సువిశాలమైన స్థలంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా 2008లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రత్యక్షంగా ఉపాధి కల్పించారన్నారు. చేతివృత్తుల వారికి స్టాల్స్ ఏర్పాటు చేయించి పరోక్షంగా ఉపాధి, సాంప్రదాయ కళాకారులకు ప్రోత్సహకాలు అందించారని చెప్పారు. కల్యాణ మండపం ఉందని పేర్కొన్నారు. శిల్పారామం కళావేదిక చిన్నారుల నృత్యాలు చేస్తూ ప్రతిభను వెలికితీస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కడప శిల్పారామం ఎఒ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.



వైఎస్ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శ్యాం సుందర్‌రెడ్డి

'పది'లో ఉత్తమ ఫలితాలే లక్ష్యం

జిల్లా విద్యాశాఖాధికారి శివ ప్రకాష్‌రెడ్డి



ముఖా ముఖి..

ప్రజాశక్తి- రాయచోటి

ఈనెల 18 నుంచి నిర్వహించబోయే పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రంలో అన్నమయ్య జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించడమే తమ లక్ష్యమని జిల్లా విద్యాశాఖ అధికారి యు.శివ ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు ఎలాంటి జాగ్రతలు తీసుకోవాలి, కేంద్రాల వద్ద ఎలాంటి భద్రత చర్యలు తీసుకున్నారు వంటి వాటిపై ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలోని పాఠశాలల వివరాలు తెలియజేయండి?

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 492 పాఠశాలలున్నాయి. ఎయిడెడ్ 5, ఎపిఎంఎస్ 17, ఎపి ఆర్ఎస్ 6, ఎఎస్‌హెచ్ఆర్ఎం1, బిసి వెల్ఫేర్ 4, ప్రభుత్వ కెజిబివి 22, ఎంపిఎల్ 5, ప్రయివేట్ 190, స్కూల్ వెల్ఫేర్ 11, ట్రైబల్ వెల్ఫేర్ 8, జడ్పి 214 పాఠశాలలున్నాయి.

పదో తరగతి పరీక్షల షెడ్యూల్ వివరించండి?

పదో తరగతి పరీక్షలు ఉదయం 9:30 నుంచి 12:45 నిమిషాల వరకు జరుగుతాయి. మార్చి 18న ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1, 19న సెకండ్ లాంగ్వేజ్, 20న ఇంగ్లిష్, 22న మ్యాథ్స్, 23న ఫిజికల్ సైన్స్, 26న బయాలజీ, 27న సోషల్ స్టడీస్, 28వ తేదీ మొదటి లాంగ్వేజ్ పేపర్-2 (కాంపోజిట్ కోర్సు)/ ఓఎస్ ఎస్ ఇ మెయిన్ల గ్వేజ్ పేపర్ -1, 30న ఒఎస్ఎస్ ఇ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ -2 (సంస్కృతం, అరబిక్, పర్షియన్), వొకేషనల్ కోర్సు పరీక్ష ఉంటుంది.

ఈ ఏడాది ఎంతమంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు?

జిల్లా వ్యాప్తంగా 25,522 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 22,466, బాలురు 11,254,బాలికలు 11,212, ఒక్కసారి ఫెయిల్ అయిన విద్యార్థులు 3056, బాలురు 1749,బాలికలు 1307 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.

పరీక్ష కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేస్తున్నారు?

జిల్లా వ్యాప్తంగా 129 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో ఎ కేటగిరి 58, బి కేటగిరి 55, సి కేటగిరి 16 సెంటర్లు ఏర్పాటు చేశాం.

పరీక్షలకు ఎంత మంది సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు?

చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్లు 129, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు 129, రూట్ ఆఫీసర్లు 10, ఫ్లేయింగ్ స్క్వాడ్ ఆరుగురిని నియమించాం.

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం కల్పిస్తున్నారా?

ఇటీవల కాలంలో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కుమార్ అన్ని అధికారులతో జిల్లా అన్ని శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్ష జరిగే సమయంలో ఉదయం, మధ్యాహ్నం ఆర్‌టిసి బస్సును సౌకర్యాలు కల్పిస్తున్నాం. పరీక్ష సమయంలో విద్యుత్ అంత రాయం లేకుండా అన్ని చర్యలు తీసుసుకుంటున్నాం.

పరీక్షల కేంద్రాల వద్ద ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

ప్రతి సెంటర్‌లో ఎఎన్ఎం అందుబాటులో ఉంటారు. తాగనీరు, మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేశాం. జిరాక్స్ సెంటర్లను కూడా మూసివేస్తున్నాం. మొబైల్స్, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రానికి తీసుకురాకూడదు.

విద్యార్థులకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

విద్యార్థులు టీవీలు, సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలి. విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. సెంటర్లోకి విద్యార్థులు 30 నిమిషాలు ముందుగానే హాజరు కావాలి. విద్యార్థులకు ప్రతి సెంటర్లో కావాల్సిన మౌలిక సదుపాయాలన్నీ ఏర్పాటు చేశాం. కావున విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి అన్నమయ్య జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలపడానికి అందరూ సహకరించాలి.

సామాజిక విప్లవ వనిత సావిత్రి బాయిఫూలే

ప్రజాశక్తి-పీలేరు



సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ప్రజాసంఘాలు

సామాజిక విప్లవ వనిత సావిత్రి బాయిఫూలే అని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ఆదివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండలంలోని బంగారం ఎస్‌సి కాలనీలో సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి మహిళలు, ప్రజాసంఘాలు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి అయిన ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి అని ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని గట్టిగా నమ్మిన ఆమె, తన భర్త జ్యోతిరావుపూలేతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభిచారని పేర్కొన్నారు. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యత, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా దంపతులు భావించారని అన్నారు. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం పణంగా పెట్టి సమిష్టిగా పోరాటం చేశారని గుర్తు చేశారు. సమాజంలోని కులతత్వం, పురుషాధిక్య ధోరణులు కలిగిన చాలామంది పండిత మేధావులకు ఆమె కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసని, కానీ ఆమె ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని, పీడిత ప్రజల, స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి, బాల్య వివాహాలకు, మూఢనమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా, వితంతువుల పునర్వివాహాలు, అసమాన బ్రాహ్మణ వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నడిపిన సామాజిక విప్లవకారిణి అని కొనియాడారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, సీనియర్ నాయకులు కె. గట్టప్ప, మాలమహానాడు రాయలసీమ జిల్లాల సహాయ కార్యదర్శి నగరిమడుగు సుభాష్, భారతీయ అంబేద్కర్ సేనా సమితి అన్నమయ్య జిల్లా నాయకులు ముల్లంగి క్రిష్ణయ్య, జాతీయ అంబేద్కర్ సేవా సంఘం అన్నమయ్య జిల్లా అధికార ప్రతినిధి మచ్చ రెడ్డయ్య, మాలమహానాడు మండల ప్రచార కార్యదర్శి దప్పేపల్లి ఆనంద్, కోశాధికారి మద్దెల బాలగంగాదర్, కార్యవర్గ సభ్యులు విజయ్,ఆశ కార్యకర్త తేనేపల్లి రెడ్డమ్మ, వరలక్ష్మి, రూపా, ప్రస్సన్న, నీలావతి, సుబ్బమ్మ, రాణెమ్మ, నాగరత్న, శ్రీలేఖ, గుర్రప్ప, వెంకట రమణ, సురేంద్ర, సుబ్రహ్మణ్యం, చెంగల్ రాయులు, రెడ్డప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

కవయిత్రులకు పుట్టినిల్లు కడప

మొల్ల సాహిత్య పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గానుగపెంట హనుమంతరావు



మొల్ల సాహితీ పురస్కారాన్ని అందుకుంటున్న స్పెషల్ జుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కవులు, కవయిత్రులకు జన్మభూమి వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాలు అని భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మహా కవయిత్రి మొల్ల సాహిత్య పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. తాళ్లపాక తిమ్మక్క, కవయిత్రి మొల్లమాంబ ఉమ్మడి వైఎస్ఆర్ కడపజిల్లా వారేనన్నారు. కవిత్వంలో మేటి రచనలు చేసి వారు స్త్రీ జాతికి వన్నెతెచ్చారన్నారు. ఆదివారం ఉదయం రాజంపేటలోని ఫ్యూచర్ మైండ్స్ ఉన్నత పాఠశాలలో, మొల్ల సాహితీ జయంతి ఉత్సవాలలో భాగంగా సభ నిర్వహించారు. సభాధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ, సాహిత్యానికి యువత దూరం అవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వం కవులను, కళాకారులను, సాహితీవేత్తలను గుర్తించి, వారిని తగిన విధంగా ప్రోత్సహించాలన్నారు. మొల్ల సాహిత్య సేవా పురస్కారం అందుకున్న స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ మాట్లాడుతూ, మహా కవయిత్రి పేరుతో పురస్కారం అందుకోవడం తన సుకృతంగా భావిస్తున్నానన్నారు. కాకర్ల రాముడు మాట్లాడుతూ మొల్ల రామాయణాన్ని, ఆమె గొంతుకును ప్రజల వద్దకు తీసుకు వెళుతున్న గానుగ పెంట హనుమంతరావు అభినందనీయుడని ప్రశంసించారు. తెలుగు భాష సంరక్షణ సమితి సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ మాట్లాడుతూ భక్తి సాధనలో తన జీవితాన్ని తరింప చేసుకున్న పుణ్యమూర్తి మొల్ల అని కొనియాడారు. కార్యక్రమంలో మొల్ల సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి జీవీ మనోజ్ కుమార్, పాఠశాల వ్యవస్థాపకులు నందకిషోర్, డాక్టర్ కాశీ గారి ప్రసాద్, సాహిత్య అభిమానులు నారాయణరాజు, కోలేహరిప్రసాద్, రామచంద్ర నాయుడు, పలుకూరి వెంకటరమణ, రామ మోహన్, డి. నాగార్జున, షేక్ అబ్దుల్లా , యూ.పీ.రాయుడు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. మొల్ల సాహిత్య సేవా పురస్కారం కింద పసుపులేటి శంకర్‌ను శాలువా, జ్ఞాపిక, నగదు పారితోషికంతో ఘనంగా సత్కరించారు.

రైతు చైతన్యమే బిసివై లక్ష్యం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

రైతు చైతన్యం, యువజన పోరాటమే బిసివై (భారత చైతన్య యువ జన పార్టీ) పార్టీ లక్ష్యమని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు రామచంద్ర యాదవ్ తెలిపారు. ఆదివారం బిసివై పార్టీ రాజంపేట ఇన్‌ఛార్జి ఆకుల నర సయ్య ఆధ్వర్యంలో కళాంజలి ఫంక్షన్ హాల్ సమీపంలో ఏర్పాటుచేసిన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఆ పార్టీ వ్యవస్థాపక అధ్య క్షులు రామచంద్ర యాదవ్ పాల్గొని పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ విద్యా విధానంలో సమూలమైన మార్పులు తీసుకువచ్చి విలువలు, విజ్ఞానంతో కూడిన విద్యను విద్యార్థులకు అందించి విద్యావిధానాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయడమే తమ పార్టీ లక్ష్యం అని తెలియజేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఇంటర్మీడియట్ వరకు పూర్తిగా ఉచిత విద్యతో పాటు యువతులకు డిగ్రీ పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తామని తెలిపారు. రైతులలో చైతన్యం తీసుకువచ్చి రైతాంగ విధానాన్ని ప్రక్షాళన చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి రైతుకు ఒక ఆవు, పంట రుణాలు మాఫీ, కౌలు రైతుల కోసం ప్రత్యేక చట్టం, రాష్ట్రంలో పెండింగులో ఉన్న నీటి ప్రాజెక్టులకు, ఆయకట్టు రైతులకు ఏడాదికి రూ 10 వేలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీవై పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ముస్లిముల అభివృద్ధి జనసేనతోనే సాధ్యం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

ముస్లిముల అభివృద్ధి జనసేనతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్య దర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి ముఖరంచాన్, అధికార ప్రతినిధి కీర్తన, ఎన్నారై ఎర్రంశెట్టి హరిబాబు రాయల్, నియోజకవర్గ నాయకులు యల్ల టూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని జాతీయ రహదారి వద్ద గల పద్మప్రియ కళ్యాణమండపంలో ఉమ్మడి జిల్లాల ముస్లిమ్ జన సైన్యం ఎంజెఎస్ వారి ఆధ్వర్యంలో టిడిపి, జనసేన, బిజెపి, ముస్లిం సోదరుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా వారు పాల్గొని మాట్లాడుతూ ముస్లిం సోదరులు అన్ని విధాల ఎదగాలని, వారికి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తోడుగా ఉంటారని తెలిపారు. జనసేన పార్టీ ముస్లిములకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. అనంతరం జనసేన పార్టీ మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఎంజెఎస్ అధ్యక్షులు షేక్ అలీ అతిధులను సమావేశంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మేడా విజయ శేఖర్ రెడ్డి, బిజెపి నాయకులు షబ్బీర్ అహ్మద్, నాసర్ ఖాన్, సమావేశ కార్యనిర్వాహకులు గౌస్ లాజం, కరిముల్లా, ఇమ్రాన్, సిరాజ్, అబ్దుల్లా, కమల్‌బాషా, సలీం, మహబూబ్ బాషా, లతీఫ్, మస్తాన్, హుస్సేన్, పఠాన్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే వైసిపిలోకి చేరికలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వైసిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి టిడిపి వర్గీయులు వైసిపిలో చేరుతున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పిటిఎం మండలం, దేవప్పకోట పంచాయతీలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దొర గుండ్లవారిపల్లెకు చెందిన 25 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో వైసిపి సీనియర్ నాయకుడు శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నుంచి వైసిపిలోకి చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబు మాటలు రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. నారాయణ, రామస్వామి, శ్రీనివాస్, నవీన్, ప్రసాద్, ప్రతాప్, నరసింహులు, సుకుమార్, తోట మదనమోహన్, తోట ఉత్తన్న, మీసాల గురునాథ్, జమ్ముబాబు, చంద్ర, అన్వర్‌బాషా, సయ్యద్‌సాబ్, సఫి, బావాజాన్, షహెల్, పజిల్, చోటు మౌలాలి, మా బాషా, బావాజాన్, గుండ్లపల్లి మౌలాలి, ఆదినారాయణ, సుబ్బరాయుడు, ఆవుల సిద్ధప్ప, మంజునాథ్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.



టిడిపి వర్గీయులను పార్టీలో ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి పాలన చాలా బాగుందని, అర్హులందరికీ సకాలంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైసిపి గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు.

వైసిపిని మరోమారు గెలిపించండి : ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ మేడా రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-వీరబల్లి

పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లి కార్జున్‌రెడ్డి, జడ్పి చైర్మన్‌చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డిలు పేర్కొన్నారు.ఆదివారం మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో వైసిపి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వారు మాట్లాడుతూ 2014 ఎన్నికల ముందు 600 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్క హామీని కూడా నేరవేర్చలేదన్నారు. రాజకీయాల్లో నలభై ఏళ్ల అనుభవమని చెప్పుకుంటున్న చంద్రబాబుకు సొంతంగా పోటీ చేసి గెలిచే సత్తా లేదన్నారు. బిజెపితో పొత్తు కోసం టిడిపి, జనసేన పార్టీలు కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదురుచూసే స్థితికి దిగజారిపోయాడని అన్నారు. ప్రజాబలం ఉంటే ఇలా చేసేవాడా ప్రశ్నించారు. ప్రజలను మభ్య పెట్టేందుకు చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నారన్నారు. దేశంలోనే ఎక్కడ లేని విధంగా మన రాష్ట్రంలో వైసిపి పాలనలో సంక్షేమ పథకాలు అమల వుతున్నాయని అన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో పనిచేసి మరోసారి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని ముఖ్య మంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రిగా జగన్ రెండోసారి ప్రమాణం చేసే వరకు కార్యకర్తలు సైనికుల్లా ముందుకు సాగాలన్నారు. 175కు 175 అసెంబ్లీ, 25కు 25 పార్లమెంట్ స్థానాలను వైసిపి కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వనివి కూడా అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. నవరత్న పథకాల గురించి అభివృద్ధి సంక్షేమ గురించి వివరించారు.రాజంపేట ఎమ్మెల్యేగా ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డిని, ఎంపీగా మిథున్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలిపించు కోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎంపిపి విజయభాస్కర్ రెడ్డి, వీర నాగారెడ్డి, గాలివీటి విజయసాగర్ రెడ్డి, విఆర్ విద్యా సంస్థ అధినేత విఆర్ రెడ్డి, లాయర్ పవన్ కుమార్‌రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే మంచి భావాలు అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-గాలివీడు

ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుంచే మంచి భావాలన అలవర్చు కోవాలని ముందుకు అన్నమయ్య జిల్లా ఐదవ అదనపు జిల్లా జడ్జి ఎస్.కృష్ణన్‌కుట్టి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం గాలివీడులో రవిచంద్ర గౌతమ్ ఉన్నత పాఠశాలల వార్షికోత్సవ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే నాయకుడిగా, కార్యకర్తగా ప్రజా పౌరుడిగా ఎదగాలని అని పేర్కొన్నారు. విద్యలో ఎన్నో సమస్యలను అధిగమించి ఉన్నతమైన స్థానానికి చేరుకోవడానికి కార్యదీక్షతో కృషి చేయాల్సిన ఉందన్నారు. అనంతరం కీ.శే.గౌతమ్ స్కూల్ కరస్పాండర్ కృష్ణారెడ్డి, కరస్పాండెంట్ రవిశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆటపాటలతో ఉత్తేజ భరితంగా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జిల్లా సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషణరెడ్డి, లక్కిరెడ్డిపల్లి మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆవుల నాగభూషణ్ రెడ్డి, జెఎసి మండల కన్వీనర్ ఎస్‌కె.ఖాదర్ మోదీ, కరస్పాండెంట్లు చింటూ ఇమ్మానుయేల్, సైజు థామస్, పాఠశాల ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా జడ్జి ఎస్. కృష్ణన్‌కుట్టి

యాలి వాహనంపై ఊరేగిన బోలా శంకరుడు



యాలి వాహనంపై సిద్దేశ్వరస్వామి

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని దేవలంపేట వేసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా యాలి వాహనంపై శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి ఊరేగారు. బళ్లారి డబ్బులు, కీలుగుర్రాలు, చెక్కభజనలు మధ్య ఘనంగా ఊరేగించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం ఆదివారం మధ్యాహ్నం త్రినేత్ర ధారణ, మహా నివేదనం, నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త అఖిలేష్ తెలిపారు. త్రికోటం విజయ సారథి వేదమంత్రాలు మధ్య మండల కేంద్రంలో కలకడ పురవీధులలో రథోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, మల్లికార్జున నాయుడు, కుమార్ నాయుడు, జనార్ధన్ నాయుడు, రెడ్డప్ప నాయుడు, కుమార్ నాయుడు, జనార్ధన నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

'పది' పరీక్షల మూల్యాంకనంలో కోడింగ్ కీలకం : ఆర్‌జెడి

ప్రజాశక్తి-రాయచోటి

పదవ తరగతి పరీక్షల మూల్యాంకనంలో కోడింగ్ అత్యంత కీలకమని ఆర్‌జెడి రాఘవరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మదనపల్లి రోడ్డులో గల అజయ్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన పదవ తరగతిలో కోడింగ్ విధానంపై జరిగిన అవగాహనా కార్యక్రమానికి రాయలసీమ ప్రాంతంలోని 8 జిల్లాల విద్యాశాఖాధికారులు, అసిస్టెంట్ కమిషనర్‌లు, చీఫ్ కోడింగ్ అధికారులు,అసిస్టెంట్ కోడింగ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి రాఘవరెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి మూల్యాంకనంలో కోడింగ్ విధానంలో ఎటువంటి పొరపాట్లకు అవకాశం లేకుండా,ఒక్క విద్యార్థి కూడా నష్ట పోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రీసోర్స్ పర్సన్ సుంకర రామకృష్ణ కోడింగ్ ప్రక్రియలో మొదటి రోజు నుండి చివరి రోజు వరకు ఎలా చేయాలి, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో పూర్తిగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డిఇఒ శివప్రకాష్‌రెడ్డి, సత్యసాయి జిల్లా డిఇఒ మీనాక్షి, అనంతపురం డిఇఒ వరలక్ష్మి, కడప డిఇఒ అనురాధ, ఎడి ప్రసాద్ బాబు, డిసిఇబి సెక్రటరీ నాగమునిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌జెడి రాఘవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

మహిళలు మతోన్మాదాన్ని ఎదిరించాలి

-సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లి

దేశంలోని మహిళలందరూ మతోన్మాదాన్ని ఎదిరించాలని అప్పుడే మహిళలకు విముక్తి సాధ్యమవుతుందని సిపిఎం జిల్లాకార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మదనపల్లి విజయ నగర్ కాలనీలో అంతర్జాతీయ మహిళాదినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళల పై నేడు అనేకదాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని వీటిని ఎదిరించాలని అన్నారు. అన్నిరంగాలలో మహిళలు ముందుకు రావాలని, శాస్త్రీయ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలు ప్రగతి సాధిస్తున్నారని మనంకూడా అందులో భాగంకావాలని కోరారు. మహిళలందరూ ఐక్యమై పోరాడాలని, హక్కులు సాధించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఐద్వాజిల్లా కన్వీనర్ భాగ్యమ్మ, సిఐటియు నాయకులు హరిశర్మ, అంగన్వాడీ యూనియన్ నాయకులు మధురవాణి, రాజమ్మ, ఐద్వాపట్టణ నాయకులు షహీనా, రెడ్డిప్రసన్న, లక్ష్మీ, కమలమ్మ పాల్గొన్నారు.

పేదలచూపు కాంగ్రెస్ వైపు

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని పేదలందరూ కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే తమ జీవితాలు బాగు పడతాయని పేద ప్రజలు అనుకుంటున్నట్లు చెప్పారు. కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ అభయం పథకాన్ని అమలు చేస్తామన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రతి నెల రూ.5 వేలు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఏ పేద కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురి కాకుండా ఉండేందుకు ఈ పథకాన్ని ప్రకటిం చడం జరిగిందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల డబ్బులు కలిపినా ఇందిరమ్మ అభయ పథకాన్ని సాటి రావన్నారు. టిడిపి ప్రకటించిన సూపర్ 6 పథకాలు కూడా కాంగ్రెస్ ప్రకటించిన అభయ పథకం ముందు బలాదూర్ అన్నారు. ఇందిరమ్మ అభయం పేదలకు వరం లాంటిదని చెప్పారు. ఈ పథకం అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని తులసిరెడ్డి తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.



వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఫ్యామిలీ ఫిజీషియన్ పేదలకు వరం

ప్రజాశక్తి-కలకడ

పేద ప్రజలకు ఫ్యామిలీ ఫిజీషియన్ ఒక వరం లాంటిదని వైద్యాధికారి ఎన్‌వి.కిషోర్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఎర్రకోటపల్లి పిహెచ్‌సి పరిధిలో ఆదివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులు, అసంక్రమణ వ్యాధులు అధిక రక్తపోటు, షుగర్ వ్యాధులకు, ఆస్పత్రికి రాలేని వారికి, చిన్న పిల్లలు, గర్భిణులకు ఫ్యామిలీ ఫిజీషియన్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కలుషిత ఆహారం, నీరు వల్ల వచ్చే వ్యాధుల గురించి వివరించారు. గర్భిణులు బాలింత సంరక్షణ వ్యాక్సినేషన్ టీకాల కార్యక్రమాన్ని నూరు శాతం సాధించాలని వైద్యసిబ్బందికి సూచించారు. వేసవికాలంలో వచ్చే డయేరియా, వడదెబ్బ తీసుకోవలసిన జాగ్రత్తలను, చిన్నపిల్లలు, వృద్ధులు ఉదయం 10 గంటల తర్వాత బయటకు రాకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. వడదెబ్బ నుంచి రక్షణ పొందాలని గ్రామాలలో ఒఆర్ఎస్, అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య ఆరోగ్య కార్యకర్త సి.లక్ష్మీ దేవి, డి.వరలక్ష్మి, డేటాఎంట్రీ ఎ.రోజా, ఫైలట్ ఎ.రమేష్‌బాబు, ఆశా కార్యకర్తలు కె.అమరావతి పాల్గొన్నారు.

ఆలయానికి మైక్‌సెట్ వితరణ

ప్రజాశక్తి-నందలూరు



మైక్ సెట్‌ను అందిస్తున్న సూర్యనారాయణ

మండలం నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలోని నారాయణ రాజుపేట గ్రామ సమీపంలో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానానికి నందలూరు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సూర్యనారాయణ మైక్‌సెట్ అందజేశారు. ఆలయ ధర్మకర్త అర్చకులు కమ్మర సర్వేశ్వరఆచారి, సర్పంచ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నాయనపల్లి ఆదినారాయణ, ఎముక దుర్గయ్య, అక్కి వెంకట రమణ, తుమ్మాది శివకుమార్, పోమ్మల శివ, నరసింహులు నాయనపల్లి వెంకటసుబ్బయ్య, నరసింహ పాల్గొన్నారు.



పైప్‌లైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న పంచాయతీ సెక్రటరీ

నీటి పైప్‌లైన్ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఓబులవారిపల్లి పంచాయతీ శివశంఖారాపురం గ్రామంలో పంచాయతీ మోటర్ పైప్ లైన్ లీకేజీ కావడంతో నీరు రోడ్డుపైకి వృథాగా పోతుండటంతో గ్రామ ప్రజలు పంచాయతీ సెక్రటరీ భారతి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకున్న పంచాయతీ సెక్రటరీ వెంటనే పైప్ లైన్ లీకేజీకి మరమ్మతులు చేయించి గ్రామాలకు నీటిని సరఫరాను పునరుద్ధరించారు. పంచాయతీ కార్యదర్శి పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రెటరీ మాట్లాడుతూ వేసవికాలం సమీపిస్తుండటంతో తాగునీటికి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా వాళీశ్వర రథోత్సవం

రామసముద్రం : మండలంలోని ఆర్.నడింపల్లి పంచాయతి పరిధిలోని శ్రీ వాళీశ్వరస్వామి కొండ పైన వెలసివున్న, శ్రీ వాళీశ్వర స్వామి రథోత్సవం ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. భక్తులు అన్నదానం చేసి మొక్కులు చెల్లిం చారు. అలాగే కొండపై వెలసివున్న శ్రీఅంతర గంగమ్మ దేవాలయంలో కూడా భక్తులు అంగరంగ వైభవంగా పూజలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. ఐదు రాష్ట్రాలు నుంచి బక్తులు వేల సంఖ్యలో స్వామి వారిని దర్శించారు.

నేడు మంత్రి పెద్దిరెడ్డి రాక

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని తల్లెంవారిపల్లి గ్రామంలో మూడు కోట్ల రూపాయల నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన జడ్‌పి ఉన్నత పాఠశాల నూతన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి సోమవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, పభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, సిఎం సలహాదారు ధనుంజయరెడ్డి హాజరవుతున్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు నరసింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ కార్పొరేట్ చైర్మన్లు, డైరెక్టర్లు, మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు, కార్యకర్తలు, ఎంపిపి, జడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొంటారని తెలిపారు.



ఎన్నికల ప్రచారంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు

టిడిపిని ఆదరించండి

ప్రజాశక్తి-చిన్నమండెం

త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిని ఆదరించి రాయచోటి ఎమ్మెల్యే అభ్యర్థి రాంప్ర సాద్‌రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి హరితమ్మ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పొలిమేరపల్లి గ్రామం, కాయల వాండ్లపల్లిలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి టిడిపిని గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాంప్రసాద్‌రెడ్డి గెలిపిస్తే ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను సత్వర పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. టిడిపి అధ్యక్షులు చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు.



అనంతపురం గంగమ్మ దేవస్థానం

నేటి నుంచి గంగమ్మ జాతర

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని అనంతపురం గ్రామంలో గంగమ్మతల్లి దేవస్థానంలో మూడురోజుల పాటు జరిగే గంగమ్మ జాతర సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ చైర్మన్ మురికినాటి రెడ్డెయ్య, ఇఒ చమర్తి రవీంద్రరాజు పేర్కొన్నారు. గ్రామంలో ప్రతిఏటా లక్షలాదిమంది భక్తులతో ఘనంగా జాతర జరుగుతుందని, మహాశివరాత్రి రెండవ రోజు నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. కస్తూరిరాజుగారిపల్లె పంచా యతీలోని చాగలగుట్టపల్లి నుంచి గంగమ్మ విగ్రహాన్ని మర్రిచెట్టు చౌటుపల్లి మీదుగా జాతర తిరిగే ప్రాంతానికి అధిక సంఖ్యలో భక్తులు ఊరేగింపుగా తీసుక వస్తారని చెప్పారు. రెండు రోజులపాటు జాతరకు వచ్చిన భక్తులకు చలువ పం దిళ్లు, ఉచితంగా అన్నదానం, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్యసదుపాయం కల్పించినట్లు తెలిపారు. జాతర జరిగే ప్రాంతానికి భక్తులు చేరుకోవడానికి ఐదు రోడ్డు మార్గాల ద్వారా చేరుకోవచ్చని తెలిపారు. కడప నుంచి రామాపురం ద్వారా, కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని కొండపల్లి నుంచి, చిట్లూరు నుంచి రాయచోటి-వేంపల్లి రహదారిలోని మర్రిచెట్టు నుంచి లక్కిరెడ్డిపల్లి మండలం కేంద్రంలోని మండల కార్యాలయం నుంచి జాతర ప్రాంతానికి చేరుకోవచ్చని తెలిపారు.11న రాత్రి చెక్కభజన కోలాటం, జబర్దస్త్, రేలారే రేలా, బండలాగుడు పోటీలు నిర్వహిస్తారు.300 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు సిఐ జీవన్ గంగాధర్‌బాబు తెలిపారు.

జెయింట్ వీల్ సురక్షితమైనదేనా

గంగమ్మ జాతరలో లక్షలాదిమంది భక్తులు జాతరకు వస్తుంటారు. జాతరలో నిర్వహించే జెయింట్ వీల్, కొలంబస్, రంగులరాట్నం సురక్షిత మైనవేనా అని ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

క్రైం కార్నర్

36 మంది పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పేకాట స్థావరాలపై బి.కొత్తకోట పోలీసులు మెరుపు దాడులు చేశారు. సిఐ సూర్యనారాయణ కథనం మేరకు..మండలంలో పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం రావడంతో ఆదివారం తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న 36మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4,27,150లు నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు.

కారు, స్కూటర్ ఢీ.. వృద్ధుడు మృతి

రామాపురం: మండలం నల్లగుట్టపల్లి పంచాయతీ బిసి కాలనీ బ్రిక్స్ ఫ్యాక్టరీ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు టివిఎస్ స్కూటర్ ను ఢీకొని స్కూటర్ లిస్టు గునిసెట్టి నారాయణ(68)అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. రాయచోటి పట్టణం మాసాపేట గ్రామం రెడ్డివారి పల్లికి చెందిన బేల్దారి గునిశెట్టి నారాయణ తన సమీప బంధువులు నల్లగుట్టపల్లి గ్రామంలోని కొత్తపల్లిలో గంగమ్మ జాతరకు బోనాలు పట్టేందుకు బంధువుల ఇంటి టివిఎస్ స్కూటర్లో రామపురం వచ్చి తిరిగి నల్లగుట్టపల్లిపల్లె కొత్తపల్లికు వెళ్లడానికి క్రాస్ అవుతుండగా రాయచోటి వైపు నుంచి కడప వైపు వెళ్తున్న కారు స్కూటర్‌ను ఢీ కొట్టిందన్నారు. ఈ ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలయ్యాయని తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తూ ఉండగా మార్గ మధ్యలోని మృతి మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. శివ పరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నల్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని అనంతరాజుపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శేషసాయి కుమార్ యుకుడు ఆకడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అనంతరాజుపేట వద్ద ప్రధాన రహదారిలో మోటార్ బైక్ పై వెళుతున్న శేషసాయి కారును ఢీ కొట్టడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడని తెలిపారు. యువకుడి వద్ద లభించిన ఐడి కార్డు ద్వారా వివరాలు సేకరిస్తున్నామని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భర్త కనిపించలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి-రామాపురం

: మండలంలోని హసనాపురం పంచాయతీ పప్పిరెడ్డి గారి పల్లి కు చెందిన గరికపాటి వెంకట బాలమురళి (30) ఈనెల 6వ తేదీన నుంచి కనిపించలేదని అతని భార్య సలేంద్ర చిన్న రెడ్డమ్మ ఆదివారం రామాపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వి.ఎల్.ప్రసాద్ రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని హసనాపురం పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లి చెందిన గరికపాటి వెంకట బాలమురళితో రాయచోటి పట్టణం, మదనపల్లి రోడ్డులోని శివాలయం సమీపంలో నివాసం ఉంటున్న ఆకుల శంకరయ్య కుమార్తె సలింద్ర చిన్న రెడ్డమ్మతో మూడు సంవత్సరాల క్రితం వివాహమైందని తెలిపారు. వీరికి పాప, బాబు ఇద్దరు పిల్లలు ఉన్నారని ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. ఆమె కాన్పు కోసం తండ్రి ఇంటికి రాయచోటికి వచ్చి వచ్చిందని, తన భర్త గరికపాటి వెంకట బాలమురళి ఆ గ్రామంలోని ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నాడని తెలిపారు. ఈనెల 6న రాయచోటి నుంచి తన స్వగ్రామం పప్పిరెడ్డిగారి పల్లెకు వెళ్తానని చెప్పి అప్పటినుంచి ఇంతవరకు రాయచోటి గాని, తన స్వగృహంలో గాని రాలేదని తెలిపారు. చుట్టుపక్కల బం ధువుల ఇళ్లలో వెతికినా ఎక్కడ కనిపించక పోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



బాలమురళి (ఫైల్‌ఫొటో)